

తాళ్లవలస జాతీయరహదారి నుంచి దొరతోట రోడ్డులో గుంతలు

రోడ్లన్నీ గుంతలే




గుంతలతో నిండిన రెండో వార్డు ఆదర్శనగర్ నుంచి నమ్మివానిపేట రహదారి

- అమలు కాని రాష్ట్రప్రభుత్వ ఆదేశాలు
- భీమిలిలో అధ్వానంగా రహదారులు
- నరకం చూస్తున్న వాహనదారులు
- తరచూ ప్రమాదాలు

సంక్రాంతి నాటికి రాష్ట్రంలో రహదారులను గుంతల రహితంగా మారుస్తామని చెప్పిన రాష్ట్రప్రభుత్వం చేతల్లో విఫలమైంది. ఎక్కడికక్కడ గుంతలతో నిండిన రోడ్లే ఇందుకు నిదర్శనం. భీమిలి నియోజకవర్గంలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. శిథిల రహదారుల్లో ప్రయాణించలేక స్థానికులు నరకం చూస్తున్నారు.

తగరపువలస: పేరు గొప్ప ఊరు దిబ్బలా తయారయింది కూటమి పాలనలో భీమిలి పరిస్థితి. రాష్ట్రంలో పెద్ద నియోజకవర్గం, ఇటీవల ఎన్నికలలో అత్యధిక మెజారిటీ సాధించామని గొప్పలు చెప్పుకోవడంతోనే ఇక్కడి మూడు పార్టీల నాయకులకు తెల్లారిపోతుంది. మరోవైపు సంక్రాంతి నాటికి గ్రామీణ రహదారులను మెరిపిస్తామని చెప్పుకొన్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనులు చేపట్టలేదు. దీంతో నియోజకవర్గంలో రహదారులు గుంతలమయమై ఉన్నాయి. ఈ దారుల్లో ప్రయాణమంటేనే స్థానికులు హడలిపోతున్నారు. ఇక వర్షం పడితే ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు.



తాళ్లవలస నుంచి భీమిలి కుమ్మరిపాలెం రహదారి దుస్థితి



సంగివలస హైవే నుంచి పాండ్రంగి వెళ్లే రహదారిపై గోతులు

ఎక్కడ చూసినా గుంతలే..

- భీమిలిని ఆనుకుని ఉన్న జీవీఎంసీ భీమిలి జోన్‌తో పాటు మండలాల్లోనూ అదే పరిస్థితి నెలకొని ఉంది. సింహాచలం నుంచి ఆనందపురం, పద్మనాభం మండలాలను కలుపుతూ విజయనగరం వెళ్లే మార్గంలో చాలావరకు రహదారి శిథిలమైంది. దీంతో ఇటీవల రెడిపల్లి పంచాయతీలో అక్కడివారు రోడ్డుపై నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.
- ఆనందపురం మండలంలోని కుసులవాడ, వెల్లంకి, పెద్దిపాలెం, పందలపాక, గొట్టిపల్లి, చందక, గిడిజాల, బోని పంచాయతీలకు వెళ్లే రహదారులు పలుచోట్ల శిథిలమయ్యాయి.
- భీమిలి మండలంలో తాటితూరు, దాకమర్రి, చిప్పాడ, లక్ష్మీపురం, శింగనబంధ, నారాయణరాజుపేట, తాళ్లవలస పీహెచ్‌సీ రహదారి, కుమ్మరిపాలెం మీదుగా భీమిలి, సంగివలస జాతీయరహదారి నుంచి పద్మనాభం మండలం పాండ్రంగి మీదుగా ఆనందపురం మండలంలోని బోని పంచాయితీకి వెళ్లే రహదారి, జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు పరిధిలోని ఆదర్శనగర్ నుంచి నమ్మివానిపేట మీదుగా బ్యాంకు కాలనీకి వెళ్లే రహదారి గుంతలతో నిండిపోయింది. వర్షాలకు ఈ ప్రాంతంలో రహదారులు భౌగోళిక మ్యాప్‌లుగా దర్శనమిస్తున్నాయి.

పేరుకే కూటమి..

పేరుకే కూటమి ప్రభుత్వం.. కానీ, వాస్తవంగా భీమిలిలో వీరికి పొసగడం లేదు. జనసేన, బీజేపీ నాయకుల విన్నపాలను టీడీపీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. గుంతలతో కూడిన తమ గ్రామ రహదారులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నా అధికారులు నామమాత్రంగా అయినా స్పందించడం లేదని వాపోతున్నారు.

అభివృద్ధి లేదు, సంక్షేమమూ లేదు



కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చి సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదు. అలాగని, అభివృద్ధి కూడా కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాలకు రహదారులు బాగుంటే కదా అభివృద్ధి జరుగుతుంది.

– కోరాడ ఆదినారాయణ, తర్లువాడ

వాహనాలు పాడైపోతున్నాయి



ఆనందపురం మండలంలోని నీళ్లకుండీల నుంచి పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లి శివారు వరకు బీటీ రోడ్డుకు పలుచోట్ల గుంతలు ఉన్నాయి. ఇవి మనుష్యుల ప్రాణాలను తోడేస్తున్నాయి. వాహనాలను మూలకు చేరుస్తున్నాయి.

– కాళ్ల గౌరి, కుసులవాడ

ప్రయాణమంటే దడగా ఉంటుంది



భీమిలిలో చాలాచోట్ల రహదారులు శిథిలమయ్యాయి. ఆ రోడ్లలో రాకపోకలు సాగించాలంటేనే దడగా ఉంటోంది. వర్షం పడితే ఏ గొయ్యి ఎంతలోతుగా ఉందో చెప్పలేకపోతున్నాం. రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.

–చిల్ల వెంకటరమణ, చిప్పాడ

క్లుప్తంగా

పశువులకు ప్రత్యేక పూజలు



ఆదర్శనగర్‌లో గంగిరెద్దుకు పూజ చేస్తున్న దంపతులు

తగరపువలస: ముక్కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని పాడి పశువులకు, గంగిరెద్దులకు గ్రామీణవాసులు ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి పర్వదినంలో పాడిరైతులు పశు సంపదకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ముఖ్యంగా కనుమ, ముక్కనుమ పండగల రోజున పశువులను శుభ్రం చేసి పసుపు, కుంకుమలు పెట్టి ఆరాధించడం ఆనవాయితీగా వస్తోంది. పశువులను పూజిస్తే దేవతలను ఆరాధించినట్టేనని భావిస్తారు. అందులో భాగంగా గ్రామీణ భీమిలి, ఆనందపురం తదితర ప్రాంతాల్లో పలువురు పశువులకు పూజలు చేశారు.

బైక్ వీల్ పంక్చర్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పీఎంపాలెం: ద్విచక్రవాహనం ముందు చక్రం పంక్చర్ కావడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. నగరంలోని రెల్లి వీధికి చెందిన పి.శ్రీనివాస్, పరిసర ప్రాంతాలకు చెందిన చెందిన అతని మిత్రులు జి.శివ, బసవ షణ్ముఖ సాయికుమార్ బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 గంటల ప్రాంతంలో భీమిలి వైపు వెళ్తున్నారు. శివ బైక్ నడుపుతుండగా.. రుషికొండ బీచ్ రోడ్డులో ఏ–1 గ్రాండ్ హోటల్ సమీపంలో ముందు చక్రం పంచర్ అయింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ కింద పడిపోగా.. శ్రీనివాస్, షణ్ముఖ సాయిలకు తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గెడ్డ ప్రవహించేదెలా?



గెడ్డలో పూడుకుపోయిన మురుగు వ్యర్థాలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలో జాతీయరహదారిని ఆనుకుని యాతపేట రోడ్డులో ఉన్న గెడ్డ మురుగు వ్యర్థాలతో పూడుకుపోయింది. యాతపేటను ఆనుకుని జాతీయ రహదారి కింద నుంచి ఈ మురుగు వ్యర్థాలు చెరువులోకి ప్రవేశించవలసి ఉంది. నెలల తరబడి ఈ గెడ్డను ఆధునీకరించకపోవడంతో విపరీతమైన దుర్గంధంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి గెడ్డలో పూడికను తొలగించి, ఎప్పటికప్పుడు మురుగునీరు ప్రవాహం సాఫీగా జరిగినట్టయితే ఎలాంటి సమస్య ఉండేది కాదు. జాతీయరహదారి అవతలి వైపు బంగారమ్మ కాలనీ వద్ద కూడా మురుగు ప్రవాహం సక్రమంగా జరగడం లేదు. దీంతో ఈ ప్రాంతవాసులకు ఇది దీర్ఘకాల సమస్యగా మారిపోయింది. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పూడిక తొలగించి, గెడ్డ ప్రక్షాళన చేయించాలని పంచాయతీ వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

21న జాబ్‌మేళా

పెందుర్తి: స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి నిమిత్తం ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత సాధించి, 18–35 ఏళ్ల వయసుగల అభ్యర్థులు హాజరు కావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 77025 06614 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

కోలాహలంగా కోదండ రాముడి పరస



కనకమ్మ తీర్థం వద్ద భక్తుల సందడి

మధురవాడ: కోదండ రాముడి పరసను గురువారం కనులపండువగా జరిపించారు. కనుమ మరుసటి రోజు మధురవాడ అప్ బ్రిడ్జి బక్కన్నపాలెం రోడ్డులోని కోదండరాముడి పరసను ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో అర్చకులు చామర్తి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సీతాలక్ష్మణ సమేత కోదండ రాముడికి ప్రత్యేక పూజలు చేశారు. పరసకు వచ్చిన భక్తులు, సందర్శకులతో మధురవాడ పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. స్టాల్స్ వద్ద సందడి నెలకొంది.



కోదండ రాముడికి పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా కనకమ్మ తీర్థం

తగరపువలస: భీమిలి, ఆనందపురం మండలాలలో గురువారం తీర్థాలు జరిగాయి. ఆనందపురంలో జరిగిన కనకమ్మ తీర్థంలో భక్తులు సందడి చేశారు. ఈ సందర్భంగా బాణసంచా, డీజే, రేలారే నృత్యాలు ప్రదర్శించారు.

- భీమిలి మండలం టి.నగరపాలెంలో 50 ఏళ్లుగా ఆనవాయితీగా జరుగుతున్న ఎల్లమ్మ పేరంటాల జాతరకు పంచాయతీ వాసులు తరలి వచ్చారు. పేరంటాలుకు పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించారు.



ఆనందపురంలో రేలారే నృత్య ప్రదర్శన



తీర్థంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద సందడి

భూలక్ష్మి అమ్మవారికి పసుపు కుంకుమలు



ఆలయం వద్ద భక్తుల సందడి

తగరపువలస: ఆనందపురం మండలం పొడుగుపాలెం భూలక్ష్మి అమ్మవారి పసుపు కుంకుమల వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులంతా ఆలయానికి బాణసంచా, కోలాటం, కలశాలతో చేరుకుని, మొక్కులు చెల్లించారు. ఆలయ పరిసరాలు సందడిగా కనిపించాయి. సంక్రాంతి ముగిసిన రోజునే అమ్మవారి వేడుకలు జరగడంతో పొడుగుపాలెం వాసుల ఇళ్లన్నీ బంధుమిత్రులతో కిటకిటలాడాయి.

శిల్పారామంలో ముగిసిన సంక్రాంతి సంబరాలు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: స్థానిక శిల్పారామం (జాతర)లో ఈ నెల 9వ తేదీ నుంచి జరుగుతున్న సంక్రాంతి సంబరాలు గురువారం సాయంత్రం ముగిశాయి. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా నగరానికి చెందిన మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు అద్భుత నృత్య విన్యాసాలతో అలరించారు. లవకుశ చిత్రంలోని పాటలకు, అమ్మవారి స్తుతి గీతాలకు, వేయినామాల వాడా తదితర కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. జానపద నృత్యాలలో సంక్రాంతి వచ్చిందే తుమ్మెద.. తమిళ జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. డి.మీనా నృత్య దర్శకత్వంలో కళాకారులు బిందుశ్రీ, భవ్య, దీక్షిత, పిక, హన్షిత, సంకీర్తన, శరణ్య, దీక్షత, ఉజ్వల తదితరుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అలంకారప్రాయం

- శిథిలావస్థలో మెరైన్ పోలీస్ టవర్
- నిలిచిన విద్యుత్ సరఫరా
- పెచ్చులు ఊడుతున్న శ్లాబ్‌లు, పగిలిన అద్దాలు



వ్యాపారులు సామగ్రి నిల్వ చేసుకునేందుకు వాడుతున్న సెల్లార్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో మెరైన్ పోలీస్ టవర్ సౌకర్యాలు లేక శిథిలావస్థకు చేరుకుంది. జోడుగుళ్లపాలెం, గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి, పెదనాగమయ్యపాలెం బీచ్‌ల వరకు రుషికొండ మెరైన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. వాస్తవానికి సముద్రంలో గూఢచారుల జాడ తెలుసుకునేందుకు, భద్రత కొరకు, పర్యాటకులను అప్రమత్తం చేసేందుకు ఈ మెరైన్ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ క్రమంలో పర్యాటకులు అత్యధికంగా వచ్చే ప్రాంతం రుషికొండ బీచ్. దీంతో ఒక వైపు తీరంలో భద్రతకు, మరోవైపు పర్యాటకులను అప్రమత్తం చేసేందుకు 2006 సంవత్సరంలో ఇక్కడ మెరైన్ పోలీస్ టవర్‌ను ఉన్నత అధికారులు అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ప్రకృతి విపత్తుల సందర్భాల్లో బలమైన ఈదురు గాలులతో పాటు, ఉప్పుగాలి కారణంగా వేగంగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పోలీసులు ఎవరూ ఈ టవర్‌లో ఉండకపోవడంతో నిరుపయోగంగా మారింది.



పగిలిన అద్దాలు

బకాయిలు ఉన్న నేపథ్యంలో ఈపీడీసీఎల్ గతేడాది విద్యుత్ సరఫరా కూడా నిలిపివేసింది. అప్పటి నుంచి ఒక్క పోలీస్ కూడా ఇటువైపు చూడటం మానేశారు. ప్రస్తుతం దీనిని అక్కడ ఉన్న చిరు వ్యాపారులు స్టోరేజ్ గొడౌన్లుగా వాడుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భద్రతా ప్రయోజనాల దృష్ట్యా ఈ మెరైన్ పోలీస్ టవర్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.



తలుపులు ఇలా..

ప్రధాన సమస్యలు

- ప్రస్తుతం ఈ టవర్‌లో కిటికీలు, తలుపులు, గోడలకు సంబంధించిన చెక్కలు, ఇతర ఫర్నిచర్ సామాగ్రి పూర్తిగా దెబ్బతిన్నాయి.
- ఈ టవర్‌పై నుంచి తీరానికి ఇరువైపులా పర్యాటకుల కదలికలు గమనించే సీసీ కెమెరా వ్యవస్థ ధ్వంసమైంది.
- పర్యాటకులను అప్రమత్తం చేసే మైక్ సెట్ మూలకు చేరింది.
- వీటి చుట్టూ ఏర్పాటు చేసిన అద్దాలు దెబ్బతిన్నాయి.
- వర్షం పడిన సమయంలో ఈ టవర్ కింద భాగాన్ని సందర్శకులు ఉపయోగించేవారు. కానీ నేడు అది అపరిశుభ్రంగా తయారైంది.



రుషికొండలోని మెరైన్ పోలీస్ టవర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

ఇక్కడ బీచ్ వద్ద ఉన్న మెరైన్ పోలీస్ టవర్‌కు సంబంధించిన సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లాం. వీటికి మరమ్మతులు చేయించి త్వరలోనే అందుబాటులోకి తీసుకుని వస్తాం.

– జి.మురళీకృష్ణ, ఎస్‌ఐ, మెరైన్ పోలీస్‌స్టేషన్, రుషికొండ


తాబేళ్ల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలు, సుస్థిర చేపల వేట విధానంపై కలెక్టర్ గురువారం సమీక్షించారు. పలు శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ఫిషింగ్ బోట్ యజమానుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆడ తాబేళ్లు నవంబర్, ఫిబ్రవరి మధ్యలో తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ఇటీవల సముద్ర తాబేళ్ల మృత కళేబరాలు తీరానికి చేరడం గమనిస్తున్నామని, అవి చేపల వేట సమయంలో వలల్లోను, సముద్రంలో విడిచిపెట్టే తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో చిక్కుకుని మరణిస్తున్నాయని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఇలాంటి పరిణామాల వల్ల భవిష్యత్తులో ఆలీవ్ రిడ్లే రకపు తాబేళ్లు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తాబేళ్లు తప్పించుకునే అవకాశం ఉన్న టీఈడీ పరికరాన్ని వినియోగించాలన్నారు.అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీవాణి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, కేంద్ర మత్స్య సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వరదరాజస్వామిగా అప్పన్న



సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజు గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను మరో పల్లకీలో వేంజేపచేశారు. సింహగిరి మాడ వీధిలో తిరువీధి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పవిత్ర 'గోస్తని' మారుతోందిలా..

- తీరంలో పందుల పెంపకంతో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఊటబావులూ అక్కడే ఉండటంతో తాగునీరు కలుషితం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గోస్తనీనది తీరాన్ని ఆనుకుని చేపడుతున్న పందుల పెంపకం కారణంగా పవిత్రమైన నది కలుషితమవుతోంది. సంగివలస–పాండ్రంగి రహదారిలో గ్రామ పంచాయతీకి అవతలి వైపు కొందరు షెడ్లు వేసి పందుల పెంపకం చేపడుతున్నారు. వీటి కోసం హోటళ్లు, ఫంక్షన్‌హాళ్ల నుంచి మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో మిగిలిపోయిన చెత్తను తెచ్చి నది తీరం వద్ద డంప్ చేస్తున్నారు. పందులు తినగా మిగిలిన వాటిని నదిలో కలిపి కలుషితం చేస్తున్నారు. అంతేకాకుండా వీటి మలమూత్రాలు కూడా నదిలో కలిసిపోతున్నాయి.



నదిని ఆనుకుని పందుల పెంపకం కోసం వేసిన షెడ్లు

తాగునీరు ఇదే..

ఇదే ప్రదేశంలో భీమిలి, విజయనగరం జిల్లాలకు చెందిన పలు గ్రామ పంచాయతీలు తమ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలకు నీటిని తరలిస్తున్నారు. వాస్తవానికి గోస్తనీనది నుంచి సేకరించిన తాగునీరు పరిశుభ్రమైనదని ఆయా గ్రామాల ప్రజలు భావిస్తుంటారు. ఇక్కడ చూస్తే కలుషిత వాతావరణంలో ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. నది ప్రవాహం ఉంటే వ్యర్థాలు కొట్టుకుపోతాయి, లేదంటే ఇక్కడే నదిలోని ఊటబావులలో ఇంకి పోతుంటాయి. దీనివలన భవిష్యత్తులో ఈ నీరు తాగేవారికి వ్యాధులు తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తీరంలో పందుల పెంపకం చేపట్టకుండా, దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



టి.నగరపాలెం గోస్తనీనది తీరంలో కలుషిత వ్యర్థాలు